క్లుప్తంగా

బాబా ఫరీద్ గంధోత్సవం



గుడేకల్ నుంచి గంధం తీసుకొస్తున్న ఆస్థాన పీఠాధిపతులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని సిరాలదొడ్డి సబ్–స్టేషన్ సమీపంలో ఉన్న శ్రీ బాబా ఫరీద్ 16వ ఉరుసు మహోత్సవాల్లో భాగంగా మంగళవారం గంధోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం గుడేకల్ గ్రామంలోని ఫకీర్ సర్దార్‌చౌక్ బాబా ఫరీద్ దర్గా నుంచి గంధాన్ని ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకువచ్చారు. అనంతరం దర్గాలో గంధం సమర్పించారు. ఈ సందర్భంగా రాత్రి ఖవాలి ఏర్పాటు చేసినట్లు పీఠాధిపతులు నూర్‌బాబా, హుసేన్‌బాబా, సర్ఫ్‌రాజ్‌బాబా తెలిపారు. బుధవారం ఉరుసు మహోత్సవం ఉంటుందని చెప్పారు. రెండు రోజుల పాటు రాత్రి భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

భక్తితో ఉత్తమ సంస్కారం

ఎమ్మిగనూరురూరల్: భక్తి ఉత్తమ సంస్కారములను అలవర్చుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని టీఎస్ కూళ్లూరు గ్రామంలో శివాలయం వద్ద టీటీడీ ఆధ్వర్యంలో హిందూ ధర్మ ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు గ్రామంలో ధార్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీటీడీ ధర్మప్రచార కమిటీ సభ్యురాలు తులసమ్మ, సర్పంచ్ మూలింగి శాంతమ్మ, మాధవస్వామి, భజన మండలి అధ్యక్షుడు నల్లన్న తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధన దినచర్యలో భాగం కావాలి

ఎమ్మిగనూరురూరల్: యోగా సాధన దినచర్యలో భాగం కావాలని బీ–ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ యు. శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ డా.ఎస్ఎం. వాగేష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ బీ–ఫార్మసీ కాలేజీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే యోగా దినోత్సవంపై ఈ–పోస్టర్, క్విజ్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి రాజశేఖర్, అధ్యాపక బృందం జగదీష్, వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏరువాక పండుగను ప్రశాంతంగా జరుపుకోండి

కోసిగి : మండలంలోని వివిధ గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ హనుమంతరెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని చింతకుంట, పల్లెపాడు, డి.బెళగళ్ గ్రామాలలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పండుగను సాంప్రదాయ బద్ధంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మల్లికార్జున, శ్రీనివాసులు, నజీర్, మునిస్వామి ఉన్నారు.

సీడీపీఓగా రాజేశ్వరిదేవి



మంత్రాలయం రూరల్ : మంత్రాలయం సీడీపీఓగా ఎస్. రాజేశ్వరిదేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ కడప జిల్లా జమ్ములమడుగు నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె ఇక్కడికి వచ్చారు. ఆమె మాట్లాడుతూ.. చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంరక్షణే ధ్యేయంగా అంగన్‌వాడీ కార్యకర్తలు విధులు నిర్వహించాన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని, బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీడీపీఓ ఎస్. రాజేశ్వరిదేవి పిలుపునిచ్చారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. కిశోర బాలికలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీపీయూ సోషల్ వర్కర్ గీతావాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, అఖిల, నాగలక్ష్మి, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను ఆపాలి



నారా లోకేష్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఆదోని రూరల్: మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను ఆపాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ డిమాండ్ చేశారు. జీవో నంబర్ 107, 108లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దిష్టిబొమ్మను ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో దహనం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రంగస్వామి, శరత్‌కుమార్, శ్రీకాంత్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.



అధ్వానంగా ఉన్న పిల్లిగుండ్ల - ఒంటెడుదిన్నె రోడ్డు



అధ్వానంగా ఉన్న బైలుప్పల- బి. అగ్రహారం రోడ్డు

అడుగుకో గుంత.. తప్పని అవస్థ

- అధ్వానంగా పిల్లిగుండ్ల, ఒంటెడుదిన్నె రహదారి
- మట్టిరోడ్లను తలపిస్తున్న బీటీ రోడ్లు
- ద్విచక్ర వాహనదారులకు ఇక్కట్లు

గోనెగండ్ల : ప్రస్తుత కూటమి పాలనలో గ్రామీణ రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయి. ఆ రోడ్ల మీద ప్రయాణం చేయాలంటే ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రజలు తమ రాకపోకలు సాగించడానికి ప్రత్యామ్నాయంగా రోడ్లు లేకపోవడంతో తప్పదన్నట్లుగా వాహనదారులు గుంతలమయంగా మారిన రోడ్లపైనే ప్రయాణం చేస్తున్నారు. ఏ మాత్రం ఏమరపాటు వహించినా వారి పని అంతే అన్నట్లుగా రోడ్లు తయారయ్యాయి. బీటీ రోడ్లు గుంతలమయమై మట్టి రోడ్లను తలపిస్తున్నాయి.

నడక కూడా కష్టమే

మండలంలోని పిల్లిగుండ్ల, ఒంటెడుదిన్నె, నెరుడుప్పల, బి. అగ్రహారం రోడ్లు దుస్థితిలో ఉన్నాయి. దీనికి తోడు ఈ మార్గంలో గ్రావెల్, కంకర టిప్పర్లు అధికంగా తిరుగుతుండటంతో రోడ్డు మరీ దారుణంగా తయారయ్యాయని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామాలన్నీ మండలానికి 5 నుంచి 10 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నాయి. అయినా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. పిల్లిగుండ్ల, ఒంటెడుదిన్నె, ఎర్రబాడు, నెరుడుప్పల దేవనకొండ మండలంలోని పలు గ్రామాలకు ఈ మార్గంలోనే వెళ్లాలి. రోడ్డు గుంతలుగా ఉండడం, మలుపుల వద్ద బురద ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు.

ప్రయాణాలు మానుకుంటున్న ప్రజలు

రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణమంటే ప్రయాణికులకు చుక్కలు కనిపిస్తున్నాయి. అవసరానికి మండలం, పట్టణానికి వెళ్లి ఏదైనా తెచ్చుకోవాలన్నా మార్గంలో వెళ్లేందుకు భయపడి వదిలేస్తున్నారు. నడుము నొప్పి, అనారోగ్యంతో ఉన్న వారు గ్రామానికి పరిమితమవుతున్నారు. అడుగడుకు ఒక గుంత ఉందని ఒక్కసారి అధికారులు ఈ మార్గంలో వస్తే వారికే సమస్య అర్థమవుతుందని వాపోతున్నారు. మండలానికి సమీపంలో ఉన్నా రోడ్డు మరమ్మతులు చేపట్టడం లేదని, ప్రభుత్వానికి అంత చిన్న చూపా అని అధికారులు, నాయకులను స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు.

పనులు చేయండి.. లేదంటే రాజీనామాను ఆమోదించండి



అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్ బాలాజీయాదవ్

ఆదోని టౌన్: పనులన్నా చేయండి.. లేదంటే రాజీనామాను ఆమోదించండని 28వ వార్డు కౌన్సిలర్ బాలాజీయాదవ్ అధికారులను నిలదీశారు. మంగళవారం చైర్‌పర్సన్ లోకేశ్వరి అధ్యక్షతన ఆదోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ప్రజా సమస్యలపై అధికారుల స్పందన లేదంటూ పాలకవర్గ సభ్యుల నిలదీతలు, నిరసనల మధ్య సమావేశం సాగింది. 28వ వార్డు కౌన్సిలర్ బాలాజీయాదవ్ మాట్లాడుతూ.. 28, 29 వార్డుల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం వహించడం వల్లనే విసుగుచెంది తాను ఇదివరకే రాజీనామా పత్రం అందజేశానని చెప్పారు. అయితే ఇంతవరకూ పనులు కూడా చేయలేదని, రాజీనామా కూడా ఆమోదించలేదన్నారు. 29వ వార్డులో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, పేరుకుపోతున్న చెత్త తదితర వాటిపై అధికారులకు పలుమార్లు విన్నవించినా పెడచెవిన పెట్టడం సరికాదన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు పనితీరును మార్చుకోవాలని, పాలకవర్గ సభ్యుల సూచన మేరకు ప్రజా సమస్యలను పరిష్కరించాలని లేకపోతే కౌన్సిలర్‌గా తాన రాజీనామాను ఆమోదించాలని చేతులు ఎత్తి మొక్కుతూ సమావేశం నుంచి వాకౌట్ చేశారు. ఇకనైనా అధికారులు మొద్దు నిద్రవీడి మేల్కొవాలన్నారు. పాలకవర్గ సభ్యుల సమస్యలపై మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, ఎంఈ ఇంతియాజ్ అలీ స్పందించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, వెను వెంటనే పరిష్కరించేలా చూస్తామన్నారు. అధికారుల నిర్లక్ష్యమంటూ ఏమీ ఉండదన్నారు. సమావేశంలో డీఈలు, టీపీఓ, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్‌తోనే మాదిగలకు ఆత్మగౌరవం



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు ఆంధ్రయ్య

గోనెగండ్ల: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావంతోనే మాదిగలకు ఆత్మగౌరవం దక్కిందని మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు ఆంధ్రయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహాదేవ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రం గోనెగండ్లలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నేతృత్వంలో 30 ఏళ్ల మాదిగల సుదీర్ఘ పోరాట ఫలితంగా సుప్రీంకోర్టు తీర్పుతో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, హర్యానా, పంజాబ్ రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణ అమలుకు ముందుకు వచ్చాయని గుర్తు చేశారు. జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ప్రతి పల్లెలో పండుగ వాతావరణంలో జరపాలని ఎమ్మార్పీఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు లక్ష్మన్న, అడివన్న, సంసోను, మధుసుదన్ రావు, చంద్ర, మేకలన్న, , కౌలుట్లం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహనుండాలి

నందవరం : క్షయవ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ శ్రీలేఖ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని మాచాపురంలో టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు వైద్యాధికారుల ఆధ్వర్యంలో టీబీ పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ..ఛాతిలో నొప్పి, శారీర భాగాల్లో గుల్లలు, వాపు రావడం, బరువు తక్కువగా ఉండడం, రాత్రిపూట చమటలు, నీరసం, అలసట వంటి సమస్యలుంటే వెంటనే ఆరోగ్య కార్యకర్తను సంప్రదించి టీబీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. టీబీ సూపర్‌వైజర్ చాంద్‌బా షా, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆదోని టౌన్: క్షయవ్యాధి నిర్మూలనకై పోరాడుదామని వైద్యులు షేకున్‌బాను, అనిల్‌సాగర్, సూపర్‌వైజర్ బాబురాజు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని 25వ వార్డులోని నారాయణ గుంత వీధిలో క్షయ వ్యాధి నిర్మూలనపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో టీబీహెచ్‌వీ సుబ్బమ్మబాయి, ఏఎన్ఎం అరుణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



దీక్షలు చేస్తున్న కార్మికులకు సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి కార్మికుల సమ్మెను విరమింపజేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు నిరవధిక దీక్షలు చేపట్టిన ఇంజినీరింగ్ కార్మికులకు ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకుడు యుకె రాజశేఖర్‌లు మంగళవారం సంఘీభావం తెలిపారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కౌన్సిల్‌లో కూడా తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపిస్తామని కార్మికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యునియన్ అధ్యక్షుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు బుట్టా ఫౌండేషన్ చేయూత


నిరుద్యోగులకు బుట్టాఫౌండేషన్ చేయూతనిచ్చి డీఎస్సీ అభ్యర్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తోందని మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ అన్నారు. మంగళవారం బుట్టాఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడో రోజు స్థానిక కార్యాలయంలో డీఎస్సీకై శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లతారెడ్డి, పామయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై అవగాహన

కోసిగి : మండల కేంద్రం కోసిగిలోని 9వ అంగన్‌వాడి కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు కిశోర వికాసంపై అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు బాగ్యలక్ష్మిబాయి, కాత్యాయని అవగాహన కల్పించారు. మంగళవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రం నుంచి పలు కాలనీల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ యువరాజు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

నందవరం : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలకు సహకరించిన వారు శిక్షార్హులవుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధావతి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముగతి గ్రామంలోని సచివాయలం–1 ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీ చేపట్టి కిశోర బాలికలు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళ పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు కుముదిని, సరస్వతి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు

కిశోర బాలబాలికల అభ్యున్నతే లక్ష్యం

ఎమ్మిగనూరుటౌన్: కిశోర బాలబాలికల అభ్యున్నతే లక్ష్యంగా ఐసీడీఎస్ పని చేస్తుందని సీడీపీఓ సఫరున్నిసా బేగం అన్నారు. కిశోర వికాసం వేసవి శిక్షణ కార్యక్రమ ముగింపు సందర్భంగా మంగళవారం పట్టణంలో 15వ వార్డులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అర్బన్ 2లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాధ, సోషల్ వర్కర్ నరసింహులు పాల్గొన్నారు.

విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ప్రారంభం

ఆదోని రూరల్: పట్టణంలో మంగళవారం దర్శనిక కార్యచరణ ప్రణాళిక యూనిట్ (విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్) కార్యాలయాన్ని ఎమ్మెల్యే పార్థసారథి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విజన్ 2047 కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 2047 సంవత్సరానికి కల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆర్థికంగా, విద్యపరంగా అన్ని రంగాల్లో వృద్ధిని సాధించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ల ప్రకారం భూమి చూపుతాం

కౌతాళం: డాక్యుమెంట్ ప్రకారం భూమిని చూపుతామని తహసీల్దారు రజినీకాంత్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఉప్పరహాళ్ గ్రామంలో రీసర్వేపై మంగళవారం గ్రామసభ నిర్వహించారు. గత మూడు నెలల నుంచి తన పొలం సర్వే చేయమని తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా సర్వే చేయడం లేదని గ్రామానికి చెందిన ఉసేని తహసీల్దారుకు వినతి పత్రాన్ని అందజేశాడు. స్పందించిన తహసీల్దారు వారం లోపు సర్వే చేసి ఇస్తామని హామీ ఇచ్చారు.

బకాయిలను విడుదల చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు చాలా కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని యుటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ నాగమణి, జిల్లా కార్యదర్శి కౌలన్న డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల మెడికల్ బిల్లులు, పీఎఫ్ లోన్లు, ఈఎల్‌బిల్లుల బకాయిలను మంజూరు చేయాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్ నియమించి పెండింగ్ డీఏలు, విడుదల చేయాలని అదేవిధంగా 30శాతం మధ్యంతర భృతిని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యుటీఫ్ నాయకులు మల్లారి నాగరాజు, రాఘవేంద్ర పాల్గొన్నారు.

గంగపుత్రుల సమస్యలు పరిష్కరించాలి

ఆదోనిటౌన్: పట్టణంలోని బెస్త, మత్స్యకార గంగపుత్ర కుల సంఘాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం నాయకులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణకు వినతి పత్రం అందించారు. రాంజల నల్లచెరువులో అక్రమంగా చేపలను పెంచుతున్నారని, దీంతో తాగునీరు కలుషితమవుతున్నాయన్నారు. చేపల పెంపకందారులపై చర్యలు తీసుకోవాలని గంగపుత్ర కుల సంఘాల ఐక్యవేదిక నాయకులు కోదండ, దీపక్‌బాబు, సత్య, ప్రకాష్, గోవిందు, నారాయణ, ఈశ్వరయ్య తదితరులు కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

మంత్రాలయం రూరల్ : బహిరంగ ప్రదేశాలల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ రామాంజులు హెచ్చరించారు. మంత్రాలయం పోలీస్‌స్టేషన్ పరిధిలో 9 మంది బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడంతో కేసులు నమోదు చేశారు. మంగళవారం వారిన్ని ఎమ్మిగనూరులో కోర్టుకు హాజరు పరుచుగా జడ్జి విచారణ చేపట్టి ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

దళితులకు భూ పంపిణీ చేయాలి

ఆదోని రూరల్: వ్యవసాయంపై ఆధారపడిన దళిత, బడుగు, బలహీనవర్గాల వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భూ పంపిణీ చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కొత్తూరు గంగన్న, సీపీఐ ఆదోని మండల కార్యదర్శి కల్లుబావిరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ శివరాములుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మదిర ఎల్లప్ప, వడ్డే సత్యనారాయణ, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని ప్రజలు తిప్పి కొట్టడం ఖాయం



గురురాజారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దంపతులు

మంత్రాలయం: ఎన్నికలు ఎప్పుడు జరిగినా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని ప్రజలు తిప్పి కొట్టడం ఖాయమని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మాలపల్లి గ్రామంలో టీడీపీ నాయకుల చేతిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు గురురాజారావు, ఆయన తండ్రి జగన్నాథరావును మంగళవారం ఎమ్మిగనూరు పట్టణంలోని ఆయన నివాసానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, సతీమణి కాచాపురం సర్పంచ్ వై.జయమ్మ వెళ్లి పరామర్శించారు. దాడికి సంబంధించి వివరాలను ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ తరుపున ఎల్లప్పుడు అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. వీరితో పాటు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు జి.భీమారెడ్డి, బూదూరు మల్లికార్జునరెడ్డి తదితరులు ఉన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు యాజమాన్య పద్ధతులను వివరిస్తున్న అధికారులు

పెద్దకడబూరు : రైతులు వ్యవసాయ అధికారుల సూచన మేరకు యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ చిరుధాన్యాల సంస్థ శాస్త్రవేత్త స్వర్ణరోణంకి, కర్నూలు ఏరువాక కేంద్రం కోఆర్డీనేటర్ డాక్టరు పీ.సుజాతమ్మ, బనవాసి కృషి విజ్ఞాన్ డాక్టర్ శ్రీచందన, డాక్టర్ బార్గవి తెలిపారు. మండల పరిధిలోని చిన్నకడబూరు గ్రామంలో మంగళవారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించి రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ చిరు ధాన్యాలలో ముఖ్యంగా కొర్రలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, విలువ, ఆధారిత ఉత్పత్తి గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఆత్మ(ఏటీఎం) రామాంజినేయులు, ఎంపీఈఓ జబివుల్లా తదితరులు పాల్గొన్నారు.

కొమ్మినేని అరెస్ట్ అన్యాయం



గడ్డం లక్ష్మీనారాయణ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును ఏపీ పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడమ అన్యాయమని, పత్రికా స్వేచ్ఛను కూటమి ప్రభుత్వం హరిస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధి గడ్డం లక్ష్మినారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాక్షి టీవీ టీవీలో ప్రసారమైన డిబెట్‌లో కృష్ణంరాజు అనే వ్యక్తి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. దీనిపై వెంటనే జర్నలిస్ట్ కొమ్మినేని ఖండించారని అన్నారు. తెలంగాణలో వున్న ఆయనకు ముందస్తుగా నోటీసులు ఇవ్వకుండా అక్కడి పోలీసులకు సమాచారం ఇవ్వకుండా ఏపీ పోలీసులు అరెస్ట్ చేయడం దారుణమన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగ పాలన రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తోందన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రయ్య

ఎమ్మిగనూరుటౌన్: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని మంజునాథ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల సీపీఐ నాయకుల జనరల్ బాడీ సమావేశం పట్టణ కార్యదర్శి రంగన్న అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ సీపీఐ జాతీయ మహాసభలు చండీఘర్‌లోను, ఏపీ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా కర్నూలులో జూలై 28, 29 తేదీల్లో జిల్లా మహాసభలుంటాయని చెప్పారు. ఆయా మహాసభలను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ..ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి ఎక్కినట్లు రూ.80వేల కోట్లతో గోదావరి బానకచర్ల నిర్మాణాన్ని చేపడతామని కూటమి సర్కార్ చెప్పుకోవడం హాస్యాస్పదంగా వుందన్నారు. ముందు హంద్రీనీవా, గాలేరు నగరి, వేదావతి, గుండ్రేవుల, ఆర్‌డీఎస్, గురురాఘవేంద్ర ప్రాజెక్ట్‌లను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సహాయకార్యదర్శి మునెప్ప, జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, పంపణ్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలి

మంత్రాలయం: మండల పరిధిలోని చెట్నేహళ్లి గ్రామంలో రెండు వర్గాల మధ్య నెలకొన్న శ్మశాన వాటిక సమస్యను సామరస్యంగా ప్రశాంత వాతావరణంలో పరిష్కరించుకోవాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. మంగళవారం రాత్రి గ్రామంలోని బీరప్ప దేవాలయం వద్ద సీఐ రామంజులు, ఎస్ఐ శివాంజల్ ఆధ్వర్యంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనవసరంగా గొడవలకు పాల్పడి కేసుల వరకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు ఆకట్టుకునేలా ఉండాలి

ఎమ్మిగనూరురూరల్: అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లలను కేంద్రాలకు రప్పించేందుకు ఆకట్టుకునేలా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కడిమెట్ల గ్రామంలోని 1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో కిషోరి వికాసం, అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం పద్మావతి, ఎంఎస్‌కేలు ఉమామహేశ్వరి, శాంతి, అంగన్‌వాడీ వర్కర్లు వెంకటేశ్వరమ్మ, శైలజ, గ్రేసమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

గోనెగండ్ల : మండలంలోని పుట్టపాశం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. వెల్దుర్తికి చెందిన 12 ఏళ్ల బాలిక ఇటీవల పుట్టపాశం గ్రామంలో ఉన్న తన చిన్నమ్మ ఇంటికి వచ్చిందన్నారు. అయితే పుట్టపాశం గ్రామానికి చెందిన అనిల్, జాన్ ఆ బాలికను ప్రేమించమని వెంటపడి వేధిస్తున్నారని బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు ఆ ఇద్దరి యువకులపై మంగళవారం సాయంత్రం పోక్సో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

వీధిదీపాలు లేక ప్రజల అవస్థలు

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెతో వీధి దీపాలు వెలగక పోవడంతో ప్రజలు రాత్రి వేళల్లో అవస్థలు పడుతున్నారని వైపీఎల్ జిల్లా కార్యదర్శి చిన్ని ప్రసాద్ అన్నారు. అధికారులు స్పందించక పోవడంపై నిరసన వ్యక్తం చేస్తూ సోమవారం రాత్రి స్థానిక కలుగొట్ల రోడ్డులో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు విజయ్‌కుమార్, చాంద్‌బాషా, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం

ఆదోని సెంట్రల్: స్థానిక ఎస్టీయూ భవన్ ప్రాంగణంలో ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఎస్టీయూ ఆదోని సీనియర్ నాయకులు మహాదేవప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా జెండాను ఎగుర వేశారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌బాబు, సూర్యుడు, వెంకటేశ్వర్లు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం పాలకవర్గంలో అవకాశం కల్పించాలి



మాట్లాడుతున్న ఆదోని డివిజన్ జంగమ అర్చక సమాఖ్య సభ్యులు

ఆదోని అర్బన్: శ్రీశైలం పుణ్యక్షేత్రమైన భ్రమరాంబా మల్లికార్జునస్వామి ఆలయ పాలకవర్గంలో పట్టణానికి చెందిన జంగమ బీసీ కులస్తురాలైన అల్కూరుమఠం జంగమ మహర్షి గిరిజావాణికి అవకాశం కల్పించాలని ఆదోని డివిజన్ జంగమ అర్చక, సమాఖ్య అధ్యక్షుడు వీరభద్రస్వామి, సెక్రటరీ మదిరె వీరేష్‌స్వామి, సభ్యులు సురేష్, శివకుమార్, సుగురేశ్వరస్వామి కోరారు. మంగళవారం స్థానిక ఎస్కేడీ కాలనీలోని కల్లుమఠంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీసీ కులానికి చెందిన జంగమ గిరిజావాణి, కుటుంబ సభ్యులు గత 14 సంవత్సరాలుగా మహాశివరాత్రి, ఉగాది పండగలను పురస్కరించుకుని స్వామివారి దర్శనానికి వెళ్లే పాదయాత్ర భక్తులకు అన్నదాన వితరణ, పేద విద్యార్థుల చదువుకు సహకారం చేస్తున్నారన్నారు. సమావేశంలో సభ్యులు మఠం మహేష్‌స్వామి, వీరభద్రయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

ఆదోని సెంట్రల్: షైనింగ్ స్టార్ అవార్డును అందుకున్న ఉమ్మి ఐమాన్ (988 మార్కులు)ను నోబుల్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సంగటి దేవదానం మంగళవారం స్థానిక కళాశాలలో అభినందించారు. విద్యార్థిని ప్రస్తుతం సెకండ్ ఇయర్ ఫిజియోథెరపీ చదువుతోంది. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ అబ్దుల్‌ఖిక్, డాక్టర్ సలోమి, ప్రీతి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.